క్లుప్తంగా

పాత పెన్షన్ అమలు చేయాలి

కడప ఎడ్యుకేషన్: 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు కేంద్ర ప్రభుత్వ ఉత్తరువు 57 ప్రకారం పాత పెన్షన్ విధానం అమలు చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం కాలయాపన చేయడాన్ని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) కడప జిల్లా అధ్యక్షుడు శెట్టెం. చెన్నయ్య, ప్రధాన కార్యదర్శి డి. కొండారెడ్డి తీవ్రంగా ఖండించారు. ఈ విషయమై పలుమార్లు విజ్ఞప్తి చేసినప్పటికీ ప్రభుత్వం దాటవేత ధోరణి ప్రదర్శించడం శోచనీయమన్నారు. పాత పెన్షన్ విధానం అమలు కోసం జులై 18న రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి జిల్లా కేంద్రంలో జరుగు నిరసనలో ప్రతి ఒక్కరూ పాల్గొని నిరసన తెలియజేయాలన్నారు. పాత పెన్షన్ పథకం అమలయ్యే వరకు ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) పోరాడుతుందని వారు తెలిపారు.

వేతనాలు చెల్లించాలి



డీఈఓకు వినతిపత్రాన్ని సమర్పిస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

కడప ఎడ్యుకేషన్: జిల్లావ్యాప్తంగా ఇటీవల జరిగిన టీచర్ల బదిలీలలో బదిలీలు పొందిన సగం మంది టీచర్లకు పొజిషన్ ఐడిలు లేని కారణంగా జూన్ నెల వేతనాలు చెల్లించలేదని, వెంటనే వారికి వేతనాలు చెల్లించడానికి చర్యలు తీసుకోవాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.శ్యామసుందర్ రెడ్డి కోరారు. గురువారం ఈ విషయమై డీఈఓ షేక్ షంషుద్దీన్‌ను కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షలు, మూల్యాంకన విధులలో పాల్గొన్న సిబ్బందికి వెంటనే పారితోషికం చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష ,ప్రధాన కార్యదర్శులు ఖాదర్ బాషా, శ్రీనివాసరెడ్డి, పూర్వ జిల్లా అధ్యక్షుడు గురయ్య, జిల్లా కౌన్సిలర్లు రామచంద్రా రెడ్డి, నరసింహులు, గురయ్య, మణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి చదవాలి

కడప కోటిరెడ్డి సర్కిల్ : ప్రతి విద్యార్థి కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని నగరవాసి ఉదయ్ భాస్కర్, జెడ్పీ బాలికోన్నత పాఠశాల హెడ్మాస్టర్ భాగ్యవతి తెలిపారు. గురువారం 9వ తరగతి విద్యార్థులకు సోషల్ మీడియాపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యంగా మొబైల్ ద్వారా చెడుకు అలవాటు పడి అనేక మంది మోసాలకు గురవుతున్నారన్నారు. మొబైల్ ద్వారా మంచి ఉందని, చెడు ఉందని, అనేక మంది మోసాలకు, దురలవాట్లకు బానిసలై జల్సాలకు అలవాటుపడుతున్నారన్నారు. రేపటి భవిష్యత్‌ను పాడు చేసుకోకుండా గురువులను గౌరవిస్తూ చదువును వ్యర్థం చేసుకోకుండా కష్టపడే తత్వాన్ని అలవరుచుకోవాలన్నారు. అనంతరం 9వ తరగతి విద్యార్థులకు జామెట్రీ బాక్స్‌లను ఎస్.ఎస్.మనోజ్ఞ సహాయంతో అందజేశారు. కార్యక్రమంలో టీచర్ రమణారెడ్డి, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు



బహుమతులను అందజేస్తున్న స్టెప్ సీఈవో సాయి గ్రేస్

కడప వైఎస్ఆర్ సర్కిల్: క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని స్టెప్ సీఈవో సాయి గ్రేస్ అన్నారు. గురువారం నగర శివార్లలోని డాక్టర్ వైఎస్ఆర్ క్రీడా పాఠశాలలో నిర్వహించిన ఆస్మిత లీగ్ పోటీల్లో భాగంగా నిర్వహించిన వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. ఈ పోటీల్లో దాదాపు 48 మంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వెయిట్ లిఫ్టింగ్ సంఘం ఉపాధ్యక్షుడు జిలానీ బాష, డాక్టర్ వైఎస్ఆర్ క్రీడా పాఠశాల ప్రత్యేక అధికారి జగన్నాథ రెడ్డి, కోచ్‌లు, ఖేలో ఇండియా సిబ్బంది పాల్గొన్నారు.

అనుమతి లేని కోచింగ్ సెంటర్లపై చర్యలు తీసుకోవాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: ప్రభుత్వ అనుమతులు లేకుండా నడుపుతున్న నవోదయ కోచింగ్ సెంటర్ల పై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరపోగు రవి డిమాండ్ చేశారు. గురువారం నగరంలోని ఎస్.ఎఫ్.ఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా చదువు పేరుతో ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా విద్యార్థులను, తల్లిదండ్రులకు మోసమాటలు చెప్పి వేల రూపాయలు వసూలు చేస్తున్న యాజమాన్యం పై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అలానే ముఖ్యంగా కడప, బద్వేల్, ప్రొద్దుటూరు పోరుమామిళ్ల ప్రాంతాల్లో వీధి కి ఒకటి కోచింగ్ సెంటర్ లు నడుస్తున్నా ఉన్నత విద్యాశాఖ అధికారులు ఏమాత్రం పట్టించుకోకపోవడం పై పలు అనుమానాలు వస్తున్నాయన్నారు. చర్యలు తీసుకోకపోతే ఆందోళన చేస్తామ న్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ కడప నగర కార్యదర్శి మోహన్, నగర ఉపాధ్యక్షులు శ్రీనువాసులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకులకు ఘన స్వాగతం



43వ డివిజన్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మేయర్ సురేష్ బాబు, ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా



44వ డివిజన్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మేయర్ సురేష్ బాబు, ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

- 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టిన పనులకు శంకుస్థాపన
- పార్టీ నాయకులు, కార్యకర్తల్లో నూతనోత్సాహం

కడప కార్పొరేషన్: కూటమి ప్రభుత్వం ఏర్పడిన 13 మాసాల తర్వాత క్షేత్రస్థాయిలో పర్యటించిన వైఎస్సార్‌సీపీ నాయకులకు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.12.70 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులకు ఈనెల 15, 16, 17 తేదీల్లో మేయర్ సురేష్ బాబు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషాలు ఆయా డివిజన్ల కార్పొరేటర్లు, ఇన్‌చార్జులను వెంటబెట్టుకొని పోయి భూమిపూజ నిర్వహించారు. 15వ తేది 12 డివిజన్లు, 16వ తేది 13 డివిజన్లు, 17వ తేది 6 డివిజన్లలో రోడ్లు, డ్రైనేజీ కాలువలు, పైపులైన్ పనులకు భూమిపూజ చేసి టెంకాయలు కొట్టారు. ఈ సందర్భంగా మేయర్, ఎమ్మెల్సీ, మాజీ డిప్యూటీ సీఎంలు డివిజన్లలోని నాయకులు, కార్యకర్తలు, పార్టీ సానుభూతి పరులను పలకరిస్తూ ఉత్సాహంగా ప్రారంభోత్సవాలు చేశారు. పనులు జరిగే చోట స్థానికులను పిలిచి వారితోనే టెంకాయలు కొట్టించారు. అభివృద్ధి పనులను మీరే దగ్గరుండి బాగా చేయించుకోండంటూ ఈ అభివృద్ధి అంతా తమదేనన్న భావనను అక్కడున్న ప్రజల్లో కలిగించారు. స్థానిక ప్రజలతో మమేకమై వారి కష్ట సుఖాలను, సమస్యలను తెలుసుకున్నారు. కార్పొరేటర్లు, డివిజన్ ఇన్‌చార్జులు రెట్టించిన ఉత్సాహంతో బాణసంచా కాల్చి, పూలు జల్లి వారికి ఘన స్వాగతం పలికి వారితో ప్రారంభోత్సవాలు చేయించారు.

ఇవి కేంద్ర నిధులు..

15వ ఆర్థిక సంఘం నిధులను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిందని, ఇందులో రాష్ట్ర ప్రభుత్వం చేసిందేమీ లేదని చెప్పకనే చెప్పారు. కేంద్రమిచ్చిన నిధులకు వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలోని తమ పాలకవర్గం 50 డివిజన్లలో పనులను గుర్తించి, టెండర్లు పిలిచి, ఆ టెండర్లను సర్వసభ్య సమావేశంలో ఆమోదించి పనులు చేస్తున్నామని, ఇందులో రాష్ట్ర ప్రభుత్వం, కడప ఎమ్మెల్యే మాధవి పాత్ర ఏమీ లేదన్న సంకేతాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లారు. పైగా కడప ఎమ్మెల్యే మాధవి 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టే పనులకు సంబంధించిన తీర్మాణాలను ఆమోదించకుండా 2024 డిసెంబర్ 23న జరిగిన సర్వసభ్య సమావేశంలో రచ్చ చేసి ఎజెండా పేపర్లను చించి వేశారనే విషయాన్ని ప్రజలకు గుర్తు చేశారు. ఎమ్మెల్యే ఎంత రెచ్చగొట్టినా తాము సంయమనంతో వ్యవహరించి కడప నగరాభివృద్ధికి కట్టుబడి ఎజెండాలోని అన్ని తీర్మాణాలను ఏకగ్రీవంగా ఆమోదించడం... వాటిని కమిషనర్ మనోజ్‌రెడ్డి మినిట్స్‌లో రాసి ఆమోదించకుండా తాత్సారం చేసినా, స్టాండింగ్ కౌన్సిల్ ద్వారా న్యాయ సలహా పొంది పట్టుబట్టి ఆమోదింపజేసుకున్న విషయాలను ప్రజలకు మరోసారి బహిర్గతం చేశారు. నగరాభివృద్ధి కోసం తాము ఇంతగా పరితపించాము కాబట్టే ఈ పనులు జరుగుతున్నాయి...ఎమ్మెల్యేలాగా తాము కూడా వ్యవహరించి ఉంటే ఈ పనులు జరిగేవే కాదని వారు బల్లగుద్ది చెబుతున్నారు. నాడు సర్వసభ్య సమావేశంలో కుర్చీ వేయలేదనే కారణంతో సభనే జరక్కుండా అడ్డుకున్న ఎమ్మెల్యే... నేడు తాము తీర్మాణించిన పనులకు నిసిగ్గుగా శంకుస్థాపన చేస్తున్నారని ఘండిపడుతున్నారు. కేవలం అధికారముందనే అహంకారంతో నగరపాలక అధికారులందరినీ బెదిరించి, భయపెట్టి తన వెంట తిప్పుకుంటూ రాజ్యాంగానికి తూట్లు పొడిచి, అప్రజాస్వామ్యంగా నగరపాలక సంస్థపై పెత్తనం చెలాయిస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మూడో రోజు కొనసాగిన శంకుస్థాపనలు

కడప నగరంలో మూడో రోజైన 17వ తేది కూడా మేయర్ సురేష్ బాబు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషాలు పలు డివిజన్లలో శంకుస్థాపనలు చేశారు. 43, 41, 44, 46, 48 డివిజన్లలో అభివృద్ధి పనులకు టెంకాయలు కొట్టి భూమిపూజలు చేశారు. ఈ కార్యక్రమాల్లో డిప్యూటీ మేయర్లు ముంతాజ్‌బేగం, నిత్యానందరెడ్డి, కార్పొరేటర్లు శ్రీలేఖ, వి. హేమలత, వి. శ్రీదేవి, డివిజన్ ఇన్‌చార్జులు రెడ్డి ప్రసాద్, జమాల్‌వలీ, నాగమల్లారెడ్డి, వి. రామక్రిష్ణారెడ్డి, బంగారు నాగయ్య యాదవ్, పార్టీ నాయకులు పి. జయచంద్రారెడ్డి, దాసరి శివప్రసాద్, షఫీ, గయాజ్, జిలానీ బాషా పాల్గొన్నారు.

వైభవంగా శీతల గంగమ్మ జాతర



ప్రత్యేక అలంకరణలో గంగమ్మ తల్లి

సిద్దవటం : మండలంలోని మాధవరం-1 పంచాయతీ పార్వతీపురం గ్రామంలో వెలసిన శ్రీ శీతల గంగమ్మ అమ్మవారి జాతర సందర్భంగా గురువారం భక్తులు వైభవోపేతంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి బోనాలు సమర్పించారు. కొందరు భక్తులు అమ్మవారికి పూజలు చేసి కోడిపుంజులు, మేకపోతులను బలిచ్చి మొక్కుబడులను తీర్చుకున్నారు. అమ్మవారిని దర్శించుకునేందుకు తెల్లవారుజాము నుంచే బారులు తీరారు. అమ్మవారికి అభిషేకం, అలంకరణ, ముద్దపూజ, పుణ్యాహవాచనం, సహస్ర నామార్చన, కుంకుమార్చన, ఆకుపూజ, మహానైవేద్యం వంటి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని కాయాకర్పూరాలను సమర్పించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. అంతేగాకుండా జాతర సందర్భంగా గ్రామస్తులు బంధువులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు, నాయకులను విందు భోజనాలకు పిలిపించుకోవడంతో సందడి వాతావరణం కనిపించింది. సాయంత్రం అమ్మవారి ప్రతిమను ఊరేగింపుగా తీసుకొని గ్రామ శివారులోని చెరువులో నిమజ్జనం చేశారు. జాతరలో ఎలాంటి ఘర్షణలు జరగకుండా ఒంటిమిట్ట సీఐ బాబు, సిద్దవటం ఎస్ఐ మహమ్మద్ రఫీ బందోబస్తును ఏర్పాటు చేశారు.

పోక్సో చట్టంపై అవగాహన అవసరం

సిద్దవటం : శక్తి యాప్ విద్యార్థినులకు రక్షణ కవచం లాంటిదని యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ కడప యూనిట్ సీఐ ఇదురు బాషా తెలిపారు. మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్, ఇంటర్మీడియట్ కళాశాల విద్యార్థినులకు గురువారం చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ విద్యార్థినులను లైంగిక వేధింపులకు గురి చేసినా, ర్యాగింగ్‌కు పాల్పడిన కఠిన చర్యలు తప్పవన్నారు. అలాగే బాల్య వివాహాలు, సెల్‌ఫోన్ వినియోగం, ఈవ్‌టీజింగ్, పోక్సో చట్టం, బ్యాడ్ టచ్, గుడ్ టచ్ గురించి అవగాహన కల్పించి, పిల్లలకు అమూల్యమైన సలహాలు, సూచనలు తెలియజేశారు. ఆడపిల్లలు మగ పిల్లలకు ఇచ్చే చనువు వలన తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని గతంలో జరిగిన వాస్తవ సంఘటనతో ఆయన వివరించారు. పోక్సో చట్టం గురించి విద్యార్థులందరూ తెలుసుకోవడం ఎంతో అవసరమని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు ఈ చట్టం గురించి పూర్తిగా అవగాహన కల్పించారు. అపరిచితులతో జాగ్రత్తగా ఉండాలని, కొత్త ప్రాంతాలకు వెళ్లేటప్పుడు తగిన జాగ్రత్తలను తీసుకోవాలని చెప్పారు. పిల్లలపై ఏదైనా అఘాయిత్యం జరిగితే 1098, 1122, 100కి సమాచారం ఇవ్వాలని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం శ్రీహరి, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

సబ్ జైల్ తనిఖీ

రాయచోటి టౌన్ : రాయచోటి సబ్ జైల్‌ను జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి బాబా ఫక్రుద్దీన్ తనిఖీ చేశారు. గురువారం ఆయన జైల్‌లో శిక్ష అనుభవిస్తున్న ఖైదీలతో మాట్లాడారు. లీగల్ ఎయిడ్ క్లినిక్ ప్రాధాన్యతపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. జైలు లోపల వారికి ఉన్న హక్కులు, ఉచిత న్యాయ సహాయం, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టంపై అవగాహన కల్పించారు. అలానే వారి ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. లీగల్ సర్వీసెస్ హెల్ప్‌లైన్ నంబర్ 15100పై ప్రచారం కల్పించాలని అధికారులకు సూచించారు. అనంతరం జైల్ పరిసరాలను పరిశీలించారు. జైళ్ల రికార్డులను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్, ప్యానల్ న్యాయవాది, ఇతర అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

కడప కార్పొరేషన్: విద్యుత్ ఉత్పత్తి, పంపిణీ సంస్థలలో పనిచేస్తున్న విద్యుత్ ఉద్యోగులు, కార్మిక సమస్యలు పరిష్కారం చేయాలని విద్యుత్ రంగంలోని ఏఐటీయూసీ అనుబంధ సంఘాలు డిమాండ్ చేశాయి. గురువారం శంకరాపురంలోని ఏపీ ట్రాన్స్‌కో కార్యాలయంలో ఏపీ ఎలక్ట్రిసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్, గ్రామ వార్డు సచివాలయ ఎనర్జీ ఎంప్లాయిస్ అసోసియేషన్, ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్, మీటర్ రీడర్స్ అసోసియేషన్‌ల ఆధ్వర్యంలో ఛలో విజయవాడకు సంబంధించిన పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎనర్జీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి ఓ. మల్లికార్జునరెడ్డి, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎల్. నాగ సుబ్బారెడ్డిలు మాట్లాడుతూ విద్యుత్ రంగంలో పనిచేస్తున్న ఉద్యోగులు కార్మికులు అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏళ్లు గడుస్తున్నా సమస్యలు పరిష్కరించడంలో అధికార యంత్రాంగం విఫలమైందన్నారు. తమ డిమాండ్ల సాధనకు 21వ తేది 'ఛలో విజయవాడ' కార్యక్రమం నిర్వహిస్తున్నామని, విద్యుత్ ఉద్యోగులు, కార్మికులు ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్ కో కన్వీనర్ వేణు, గ్రామ, వార్డు సచివాలయ ఎనర్జీ ఎంప్లాయిస్ అసోషియేషన్ జిల్లా కార్యదర్శి కృపాకర్, ఉపాధ్యక్షులు ఎస్. మల్లికార్జున, ప్రకాష్ రావు, స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ నాయకులు ప్రతాప్‌రెడ్డి, గురుస్వామి, దస్తగిరి, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు ప్రసాద్, జయక్రిష్ణారెడ్డి, హరికేశవరెడ్డి, రామాంజనేయరెడ్డి, బిల్ రీడర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి గఫార్ బాషా పాల్గొన్నారు.



'ఛలో విజయవాడ' పోస్టర్లను ఆవిష్కరిస్తున్న పలు యూనియన్ల నాయకులు

మైక్రోప్లాస్టిక్‌తో పర్యావరణానికి ముప్పు

కడప ఎడ్యుకేషన్: మైక్రోప్లాస్టిక్ వాడకం వల్ల మనుషుల ఆరోగ్యంతోపాటు పర్యావరణానికి కూడా ముప్పు వాటిల్లుతుందని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ మహిళా డిగ్రీ కళాశాల మైక్రోబయాలజీ లెక్చరర్ ప్రకాష్ నారాయణరెడ్డి సూచించారు. స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాలలో భాగంగా గురువారం కళాశాలలో ప్లాస్టిక్ కాలుష్యాన్ని నివారించేందుకు జీవాణుశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ×మైక్రోప్లాస్టిక్స్ - ఆహార, నీటి భద్రత కోసం నివారణ మార్గాల్లు అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య వక్తగా డా. కె. ప్రకాష్ నారాయణ రెడ్డి పాల్గొని మైక్రోప్లాస్టిక్‌ల మూలాలు, ప్రభావాలు, వాటిని తగ్గించేందుకు తీసుకోవాల్సిన నియంత్రణ చర్యలపై విశ్లేషణాత్మకంగా విద్యార్థులకు వివరించారు. మైక్రోప్లాస్టిక్స్ మన ఆరోగ్యంతోపాటు పర్యావరణంపై కలిగించే ప్రభావాలు ఆందోళనకరం అని అన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డా. వి. సలీం బాషా మాట్లాడుతూ ప్రతి వ్యక్తి తన వంతు బాధ్యతగా ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఆర్ఎస్ సమన్వయకర్త డా. ఎల్. రాజమోహన్ రెడ్డి, రసాయన శాస్త్ర ఉపాధ్యాయుడు వి. కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న లెక్చరర్ ప్రకాష్ నారాయణ రెడ్డి

ప్రమాదకరంగా కరెంటు తీగలు



కడప నగరంలోని 36వ డివిజన్ అల్లా స్కూల్ సమీపంలో విద్యుత్ స్తంభం నుంచి సర్వీసు వైర్లు ప్రమాదకంగా కిందికి వేలాడుతూ ఉన్నాయి. కిందికి ఉండటంతో ప్రమాదం జరుగుతుందేమోనని స్థానికులు భయపడుతున్నారు. అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా స్పందించలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

– ఫొటో: సాక్షి ఫొటోగ్రాఫర్, కడప

వేతనాలివ్వకపోతే ఆందోళన

కమలాపురం : మున్సిపాలిటీలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు వేతనాల్వికపోతే ఆందోళన చేస్తామని ఏఐటీయూసీ, సీపీఐ ఏరియా కార్యదర్శులు పి.చంద్రశేఖర్, నాగేశ్వరరావు హెచ్చరించారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో వారు మున్సిపల్ కార్మికులతో మాట్లాడారు. మూడు నెలలుగా జీతాలందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, తక్షణం జీతాలు విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని కార్మికులు కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కమలాపురం మున్సిపాలిటీలో 30 మంది కార్మికులు పనిచేస్తున్నారని, మూడు నెలలుగా జీతాలు ఇవ్వక పోతే వారు ఎలా జీవనం సాగిస్తారని ఆవేదన వ్యక్తం చేశారు. డ్రైవర్లు లేక పోతే స్వీపర్లతోనే ట్రాక్టర్లు నడిపిస్తున్నారని, 10–12 గంటలు పని చేస్తూ, వెట్టి చాకిరి చేయిస్తూ జీతాలు ఇవ్వక పోతే ఎలా? అని వారు ప్రశ్నించారు.

జీతాలు ఇవ్వలేదం లేదనే విషయాలు బయట చెబితే మిమ్మల్ని తీసేస్తామని అధికారులు బెదిరించడం సరికాదని, అధికారులు తీరు మార్చుకోవాలని హితవు పలికారు. పారిశుద్ధ్య కార్మికులు జీతాల విషయంలో నిర్లక్ష్యం వహిస్తే సహించబోమని వారు హెచ్చరించారు. కార్మికులకు తక్షణం న్యాయం చేయక పోతే ఆందోళన చేపడతామని వారు హెచ్చరించారు.

ప్రజలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



చట్టాలపై అవగాహన కల్పిస్తున్న మైదుకూరు జూనియర్ సివిల్ జడ్జి ఖాజామొయినుద్దీన్

దువ్వూరు : ప్రజలందరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని మైదుకూరు జూనియర్ సివిల్ జడ్జి ఖాజామొయినుద్దీన్ తెలిపారు. మండలంలోని కృష్ణంపల్లెలో గురువారం మండల న్యాయ సేవా సమితి ఆధ్వర్యంలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ ప్రజలు అందుబాటులో ఉన్న న్యాయ చట్టాలను తెలుసుకుని అవగాహన పెంచుకోవాలన్నారు. రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు కృష్ణంపల్లె గ్రామాన్ని దత్తత తీకున్నట్లు తెలిపారు. ప్రజలకు చట్టాల గురించి తెలిపి సత్వర న్యాయం అందించడమే న్యాయవిజ్ఞాన సదస్సు లక్ష్యం అన్నారు. పుట్టబోయే బిడ్డ నుంచి పండు ముసలి వరకు ప్రతి ఒక్కరికి చట్టాలు ఉంటాయని వాటిని తెలుసుకోవాలన్నారు. 18 ఏళ్లు నిండకముందే ఆడ పిల్లలకు వివాహం చేయడం నేరమని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ కేసులపై అవగాహన అవసరమని, ఈకేసుల్లో వారికి ఉచిత న్యాయ సహాయంతోపాటు ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం అందుతున్నారు. ప్రజలు సత్వర న్యాయం పొందేందుకు చట్టాలను వినియోగించుకోవాలన్నారు. సుప్రీం కోర్టు కక్షిదారుల మధ్య కేసులను త్వరగా పరిష్కరించేందుకు మధ్యవర్తిత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. కక్షిదారుల కేసులను పరిష్కరించేందుకు న్యావాదులకు ఈ అంశంపై శిక్షణ ఇచ్చామన్నారు. చట్టపరంగా ఎవరికైనా న్యాయం కావాలంటే తమను సంప్రదించాలని, ప్రభుత్వం ఉచితంగా న్యాయం పొందే అవకాశం కల్పించిందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సంజీవరెడ్డి, ఎస్ఐ వినోద్‌కుమార్, ఎంపీడీఓ రామకృష్ణయ్య, ఏజీపీ జ్వాలా నరసింహ, ప్యానల్ లాయర్లు సోమేశుల శివరామకృష్ణ, ఎస్.శ్రీనివాసులు, న్యాయవాదులు ఇమాంబాషా, కరీముల్లా, అబ్దుల్ వహాబ్, గ్రామ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్ ఎదుట ధర్నా

కడప ఎడ్యుకేషన్: 2003 డీఎస్సీ ఫోరం రాష్ట్రశాఖ పిలుపు మేరకు శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కలెక్టరేట్ ఎదుట శాంతియుత నిరసన ధర్నాను నిర్వహిస్తున్నట్లు డీఎస్సీ 2003 టీచర్స్ ఫోరం జిల్లా కన్వీనర్లు గుజ్జల తిరుపాల్, కావేటి ఉదయ్‌భాస్కర్, మిద్దె ప్రవీణ్‌కిరణ్, వీరప్రతాప్, బండి నాగేశ్వరెడ్డి, సునిత, శోభారాణిలు తెలిపారు. ఈ ధర్నా కార్యక్రమంలో ఉద్యోగ, ఉపాధ్యాయులు పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

నిరసనకు 'రూట' మద్దతు

కడప ఎడ్యుకేషన్: రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాలలో శుక్రవారం ఓపీఎస్ సాధనకు డీఎస్సీ - 2003 టీచర్స్ ఫోరం చేపట్టనున్న నిరసన కార్యక్రమాలకు రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ (రూటా ఏపీ) సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందని రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సయ్యద్ ఇక్బాల్ ,సయ్యద్ ముష్తాఖ్ హుస్సేన్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. డీఎస్సీ -2003 నోటిఫికేషన్‌లో సీపీఎస్ విధానాన్ని అమలు పరచడం తీవ్ర అన్యాయం అన్నారు. తక్షణం పాత పెన్షన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని ఉర్దూ ఉపాధ్యా యునీ ఉపాధ్యాయులు, రూటా ఏపీ నాయకులు, కార్యకర్తలు నిరసన కార్యక్రమానికి పెద్ద ఎత్తున హాజరై సంఘీభావం తెలియజేయాలని పిలుపునిచ్చారు.

పోరాటాల ఫలితమే లెప్రసీ అలవెన్స్ మంజూరు

కడప వైఎస్ఆర్ సర్కిల్: గత నెలలో ఆశా కార్యకర్తలకు లెప్రసీ అలవెన్స్ ఇవ్వాలని రెండు రోజుల పాటు జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట రిలే దీక్షలు చేసిన పోరాట ఫలితంగా అధికారులు ఒక్క సంవత్సరం లెప్రసీ అలవెన్స్ ను మంజూరు చేశారని ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా సమితి జిల్లా గౌరవాధ్యక్షులు గుంటి వేణుగోపాల్, జిల్లా అధ్యక్షురాలు యు. మరియమ్మ కృతజ్ఞతలు తెలిపారు. ఇందుకు సహకరించిన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నాగరాజుకు, లెప్రసీ అధికారి రవి బాబుకు ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా సమితి నాయకులు గురువారం కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఇంకా మూడు సంవత్సరాల లెప్రసీ అలవెన్స్ పెండింగ్‌లో ఉందన్నారు. ఆ మొత్తాన్ని జమ చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు వరలక్ష్మి పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాన్ని మార్చరా..?



విద్యుత్ స్తంభాన్ని పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

కడప వైఎస్ఆర్ సర్కిల్: కడప నగరం రామకృష్ణనగర్ లో గత మూడు నెలల క్రితం వాటర్ ప్లాంట్ ఎదురుగా ఉన్న వీధిలో విద్యుత్ స్తంభం రోడ్డుకు అడ్డంగా ఉందని సంబంధిత అసిస్టెంట్ ఇంజనీర్ దృష్టికి తీసుకొచ్చినా ఇప్పటివరకు మార్చకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని, తక్షణమే అతడిని ఉన్నతాధికారులు సస్పెండ్ చేయాలని సీపీఎం నగర కార్యదర్శి ఎ.రామమోహన్ డిమాండ్ చేశారు. గురువారం నగరంలోని రామకృష్ణ నగర్ లో ప్రజా చైతన్య యాత్రను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ శాఖ అధికారులు అవినీతికి పాల్పడుతూ సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. పది రోజుల్లోగా విద్యుత్ స్తంభాన్ని మార్చకపోతే సంబంధిత కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నగర కమిటీ సభ్యులు వెంకటేశ్వర్లు, కామేశ్వరమ్మ, కుమారస్వామిరెడ్డి, రామకృష్ణారెడ్డి, నరసింహ, వెంకటసుబ్బయ్య, శేఖర్, మధు ప్రజలు పాల్గొన్నారు.

ఇద్దరికి తీవ్రగాయాలు

కడప అర్బన్: కడప - రాయచోటి రహదారిలో గురువారం రాత్రి ఊటుకూరు వద్ద రెండు మోటార్‌సైకిళ్లు పరస్పరం ఢీకొనడంతో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. సంఘటన జరిగిన వెంటనే ట్రాఫిక్ పోలీసులు 108 అంబులెన్స్‌లో రిమ్స్‌కు తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి వుంది.

విభజన హామీల అమలేదీ..?

కడప వైఎస్ఆర్ సర్కిల్: విభజన హామీలు అమలు చేయాలని కోరుతూ కడప ఉక్కు పరిశ్రమ నిర్మించాలని, రాయలసీమకు ప్యాకేజీ వంటి డిమాండ్లతో శుక్రవారం ఢిల్లీ లో జంతర్ మంతర్ వద్ద జరిగే ధర్నాకు కడప నాయకులు వెళ్లారని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ముడియం చిన్ని, వీరనాల శివకుమార్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి విభజన హామీలు మరచిపోయిందన్నారు. ఆంధ్రప్రదేశ్ కు ఇచ్చిన హామీలను విస్మరించిందన్నారు. కడప ఉక్కు కు నిధులు లేవు, వెనుకబడిన రాయలసీమ కు ప్యాకేజీ లేదు, ఉపాధి పరిశ్రమల ఏర్పాటు లేదన్నారు. పోరాడి సాధించుకున్న విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి ఎస్కే ఆదిల్, జిల్లా కమిటీ సభ్యులు ప్రసాద్, నాయకులు సురేంద్ర పాల్గొన్నారు.

ఆర్థిక హామీల అమలులో నిర్లక్ష్యం తగదు

బద్వేలు అర్బన్ : ఎన్నికల సమయంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు ఇచ్చిన ఆర్థికపరమైన హామీల అమలులో నిర్లక్ష్యం తగదని ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి పేర్కొన్నారు. గురువారం బద్వేలులో నిర్వహించిన ఎస్టీయూ బద్వేలు ప్రాంతీయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ 11వ పీఆర్సీ బకాయిలు, పెండింగ్‌లో ఉన్న డీఏలు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు.